వాంకిడి : వాడల వీధిలో సంచరిస్తున్న కుక్కలు

## కుక్కల స్వైరవిహారం

వాంకిడి, జనవరి 7 : మండల కేంద్రంలోని పలు కాలనీల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. శివ కేశవ్‌నగర్, ఇంద్రనగర్, రామ్‌నగర్, అంబేద్కర్‌వాడ, హనుమాన్ టెంపుల్ వాడల వీధుల్లో నిత్యం గుంపులుగా కుక్కలు సంచరిస్తున్నాయి. వాటి వైపు వెళ్లాలంటే స్థానికులు వణుకుతు న్నారు. పగలు రాత్రి తేడా లేకుండా పాదచారులు, వాహనదారులను వెంబడిస్తూ భయ పెడుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులకు వివిధ రూపాల్లో ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదని ఆయా కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద తప్పించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## సదరం కోసం ఎదురుచూపులు

వాంకిడి,జనవరి 7: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన దివ్యాంగులు సదరం కోసం అవస్థలు తప్పడం లేదు. దివ్యాంగులకు ప్రభుత్వం కల్పించే రాయితీలు లభించాలంటే వైకల్యాన్ని తెలిపే సదరం ధ్రువీకరణపత్రం తప్పనిసరి. 4 నెలల క్రితం సదరం క్యాంప్ నిర్వహించారు. చెవిటి, మూగ, కంటి చూపు, అంగవైకల్యం తదితర సమస్యలు ఉన్న దివ్యాంగులు పింఛన్ కోసం సదరంలో నమోదు చేసుకోవాల్సి ఉంది. కానీ మీసేవా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు కేవలం రెండు నుంచి ఐదు నిమిషాల సమయం మాత్రమే కేటాయిస్తున్నారు. వెంటనే వెబ్సైట్ ఆన్లైన్ సేవలు నిలిచిపోవడంతో మీసేవా నిర్వాహకులు కూడా ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడుతున్నది. సమస్య మాత్రం అలాగే కొనసాగుతున్నది. తమ పిల్లలకు న్యాయం చేయాలని దివ్యాంగుల తల్లిదండ్రులు కోరుతున్నారు. సదరం వెబ్సైట్ కేవలం రెండు నుంచి ఐదు నిమిషాలు ఉండడంతో ఒకరిద్దరికి మాత్రమే అవకాశం కల్గుతున్నది. దీంతో మిగతా వారందరూ నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

బెజ్జూర్, జనవరి 7: ప్రాణహితలో పుణ్య స్నానానికి వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. మండలంలోని లోడ్‌పల్లి గ్రామానికి చెందిన ఆత్రం ధర్మయ్య (60) శనివారం తన కుటుంబసభ్యులతో కలిసి షష్టి బోనాల సందర్భంగా మండలంలోని సోమిని గ్రామసమీపంలో ప్రాణహిత నదిలో పుణ్య స్నానానికి వెళ్లాడు. కుటుంబసభ్యులతో పాటు నదిలో స్నానం చేస్తూ లోతుగా ఉన్న నీళ్లలోకి పోయి గల్లంతయ్యాడు. కుటుంబసభ్యులు శనివారం చీకటిపడే వరకు వెతికినా ధర్మయ్య ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం ప్రాణహితలో చేపలు పడుతున్న మత్స్య కారులకు ధర్మయ్య మృతదేహం కనిపించగా వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# మిర్చి సాగు.. భలే బాగు

- వాణిజ్య పంటలవైపు గ్రామీణ రైతులు
- మండలంలో 300ఎకరాల్లో పంట
- దహెగాంలో యెల్లో మిరప

దహెగాం, జనవరి 7 : వాణిజ్య పంటల సాగు అనగానే పట్టణప్రాంతాల పరివాహక గ్రామాల్లో సాగుచేస్తుంటారు. కానీ నేడు మారుమూల ప్రాంతాల్లో కూడా వాణిజ్య పంటలను సాగుచేస్తున్నారు. దీనికి గత కేసీఆర్ సర్కార్ అందించిన వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌తో పాటు వ్యవసాయాభివృద్ధిపై తీసుకున్న చొరవనే కారణమని చెప్పుకోవచ్చును. మండలంలో సుమారుగా వివిధ గ్రామాల్లో 100 ఎకరాల్లో మిర్చి సాగుచేయగా లాభదాయకమైన దిగుబడి వచ్చింది.దీంతో ఈ యేడాది మండలకేంద్రంతో పాటు అయినం, లగ్గాం, ఒడ్డుగూడ, గిరవెల్లి తదితర గ్రామాల్లో 300 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. ప్రస్తుతానికి పంట ఆశాజనకంగా ఉండడంతో కొందరు రైతులు మొదటి పంట సేకరిస్తున్నారు. పంట ఎకరానికి మన ప్రాంతాల నేల స్వభావాల ప్రకారం 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశముంది. రైతులు వివిధ ప్రాంతాల నుంచి విత్తనాలను తీసుకొచ్చి నారు పెంచి తోటలను సాగు చేశారు. దీనికి తోడు హార్టీకల్చర్, వ్యవసాయాధికారులు అందుబాటులో ఉంటూ రైతులకు సలహాలు సూచనలు ఇస్తున్నారు. బోరుబావుల నుంచి నీటిని వినియోగించుకుంటున్నారు. మిర్చి ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తే రైతులకు సిరులు కురుస్తాయి.

దహెగాం: యెల్లో మిర్చిని చూపిస్తున్న రైతు

దహెగాం: లగ్గాంలో ఆరబోసిన ఎర్రమిర్చి

**• దహెగాంలో యెల్లో మిర్చి సాగు..**

మండలకేంద్రానికి చెందిన ముడుపు రఘోత్తమరెడ్డి అనే రైతు ఎర్రమిర్చితో పాటు ఒక అరెకరంలో యెల్లో మిర్చి సాగుచేశాడు. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. వరంగల్ నుంచి 11వేల రూపాయలకు 10 గ్రాముల యెల్లో మిర్చి విత్తనాలను తీసుకువచ్చి నారు పెంచి పంట సాగుచేశాడు. పంట ప్రస్తుతానికి మంచి కాపుతో ఉంది. మొదట కాయలు ఆకుపచ్చ రంగులోనే ఉంటాయి. పండుకు వచ్చిన తర్వాత పసుపు రంగులోకి మారుతాయి. ఎర్ర మిర్చితో పోలిస్తే మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.40వేలకు పైన ఉంటుందని రైతు పేర్కొన్నాడు. పంట దిగుబడి కూడా ఎకరాకు 14 నుంచి 15 క్వింటాళ్ల వరకు వస్తుంది. సాగుఖర్చు ఇప్పటి వరకు రూ. 50వేల ఖర్చుచేశానని పేర్కొన్నాడు.

### ప్రయోగాత్మకంగా సాగుచేశా

యెల్లో మిర్చిని ప్రయోగాత్మకంగా సాగుచేశా. వరంగల్ ప్రాంతానికి చెందిన బంధువుల ద్వారా సాగు వివరాలను తెలుసుకుని అరెకరం సాగుచేశాను. మామూలుగా ఎర్రమిర్చి సాగుచేసినట్లుగానే అవే పద్ధతులు పాటించాను. ప్రస్తుతానికి మంచి కాత ఉంది. మొదట్లో కాచిన కాయ పండు దశకు వచ్చి యెల్లోగా మారుతుంది. ఈ పంటను అమ్ముకోవడానికి వరంగల్‌లోనే మార్కెట్ సౌకర్యం ఉంది. వచ్చేసారికి మళ్లీ విస్తీర్ణం పెంచుతా.

**- ముడుపు రఘోత్తమరెడ్డి, దహెగాం**

### మూడెకరాల్లో సాగుచేశా

నేను మిరప పంట మూడెకరాల్లో ఎర్ర మిర్చి (ఎండో అమెరికన్ నం.5) రకం సాగుచేశాను. పంట ప్రస్తుతం మంచిగానే ఉంది. మొదటి క్రాఫ్ ఏరుతున్నాను. ఎకరాకు మొదటి కాపు 5క్వింటాళ్ల పైననే వచ్చేలా ఉంది. పోయిన సంవత్సరం లెక్క ధర మంచిగుంటే మంచి లాభాలు వస్తాయి. ఇప్పుడిప్పుడే వాణిజ్య పంటల్లో మిర్చి పంటను సాగుచేస్తున్నాం. మార్కెట్ సౌకర్యం కల్పించాలి.

**-అనల రాజులు, లగ్గాం**

### మిరుప పంటకు అనువైన భూములున్నాయి

ఈ ప్రాంత నేలలు మిరప సాగుకు అనువుగా ఉన్నాయి. దానికి తోడు సాగునీటి సౌకర్యం ఉండడంతో రైతులు మిరపపంట సాగుకు ముందుకొస్తున్నారు. సిర్పూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ గ్రామాల్లో 1000 ఎకరాల్లో పంటను సాగుచేస్తున్నారు. దహెగాం మండలంలో 300 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. దహెగాంలో ఓ రైతు యెల్లో మిర్చి సాగుచేస్తున్నాడు. మనదేశంలో మొట్ట మొదటి సారిగా ఉత్తరఖండ్‌లో చేశారు. ప్రస్తుతం మన ప్రాంతంలో వివిధ ప్రాంతాల్లో సాగుచేశారు. ఈ పొడితో మసాల పౌడర్, సూపుపొడి తదితర వస్తువులకు వాడుతారు.

**- ఏజే శాంతిప్రియదర్శిణి, హార్టీకల్చర్ అధికారి**

## 20 మందికి కంటి ఆపరేషన్‌లు

కౌటాల, జనవరి 7 : మండల కేంద్రంలోని జాన్వీ విజన్ కేర్ ఆసుపత్రిలో కౌటాల, చింతల మానేపల్లి, బెజ్జూర్ మండలాల వారికి కంటి ఆపరేషన్‌లు చేయించినట్లు జేఆర్ సర్కార్ చారిట బుల్ ట్రస్ట్ చైర్మన్ నారాయణ సర్కార్, నేత్ర వైద్యాధికారి (డీవోఏ) సీమ సర్కార్‌లు ఆదివారం తెలిపారు. ఇటీవల దవాఖానలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించి ఆపరేషన్ అవసరమున్న 12 మందికి లయన్స్ క్లబ్ కొత్తపేట వారి సహకారంతో బెల్లం పల్లిలో ఆదివారం కంటి పరీక్షలు చేయించి వారి వారి స్థానాలకు పంపించినట్లు వారు తెలిపారు.

కౌటాల : కంటి ఆపరేషన్ చేసిన వారితో జాన్వీ విజన్ కేర్ సిబ్బంది

### ప్రభుత్వ కళాశాలలను రక్షించుకోవాలి

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్

ఆసిఫాబాద్,జనవరి7: ప్రభుత్వ కళాశాలలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ ఆసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ కళాశాలలో నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో రాష్ట్ర ఆసోసియేట్ అధ్యక్షుడు దేవేందర్‌తో కలిసి హాజరై మాట్లాడారు. కళాశాలలను రక్షించుకోవడంతో పాటు మన హక్కులను సాధించుకోవాలన్నారు. సంఘం పటిష్ఠంగా ఉంటేనే అన్ని విధాలుగా ముందుకెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. సంఘ సభ్యులు నిజాయితీ,నిబద్ధతతో సమన్వయంగా పని చేయాలని సూచించారు. మిగిలిన ఉన్న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి నాయిని శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నవిన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ సునీల్‌కుమార్, జిల్లాలోని లెక్చరర్లు, కాంట్రాక్టు లెక్చరర్లు ,తదితరులు పాల్గొన్నారు.

## లంబాడిహెట్టిలో వైద్యశిబిరం

చింతలమానేపల్లి , జనవరి 7: మండలంలోని లంబాడిహెట్టి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం రవీంద్రనగర్-1, బాబాజూర్, గంగాపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ, గ్రామంలోని 30 సంవత్సరాలు పైబడిన 56 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి 35 మందికి మందులు అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రతినెలా మందులు పీహెచ్‌సీ నుంచి అందిస్తామన్నారు. అదేవిధంగా చలికాలం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ధన్‌రాజ్, హెల్త్ సూపర్‌వైజర్ ఇందిరాగాంధీ, వైద్య సిబ్బంది ఉన్నారు.

లంబాడిహెట్టిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్


నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9640400073/9160900024.

NT-319407-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల వివరాలు...

GST 5% వర్తించును

సంప్రదించండి: 91827 77676, 91827 77679, 91827 77671, 91827 77677


# నడకతో నవయవ్వనం

రెబ్బెన, జనవరి 7: వాకింగ్‌తోనే ఆరోగ్యానికి రక్ష అని చాలా మంది నమ్మడంతో నడక దారులు వెతుకుతున్నారు. నడక ఆరోగ్యానికి బాట వేస్తుందని, ఉల్లాసం.. ఉత్సాహం నింపుతుందని, ప్రతిరోజూ ఉదయం చక్కని వ్యాయమం కోసం నడక సులభమైన మార్గంగా ఉందని పలువురు అభిప్రయపడుతున్నారు.ప్రతినిత్యం అరగం ట నుంచి గంట వరకు నడిచి, కొద్ది సేపు చిన్నగా వామప్ లాంటివి చేస్తే నరాలు, కండరాలు తేలికై కదలిక వస్తుం ది. క్యాన్సర్, మధుమేహం, గుండె జబ్బులు, మానసిక ఒత్తిడి, స్థూలకాయం, రక్త పోటు, కొవ్వు తగ్గించి జీవితకాలం పెంచుతుంది. నడక శరీరంలోని కండరాలు ధృఢంగా చేయడంతోపాటు రక్త ప్రసరణను పెంచుతుంది. ముఖ్యంగా గుండెపోటు, పక్షవాతం ప్రమాదాన్ని చాలా వరకు తగ్గిస్తుంది. జ్ఞాపకశక్తి పెరగడంతో పాటు నిద్రలేమి సమస్యను దూరం చేస్తుంది. మహిళల్లో డిప్రెషన్‌ను దూరం చేయడంతోపాటు బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా నివారిస్తుంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం వాకింగ్ చేయడంతో పాటు మంచి పౌష్టికాహారం తీసుకోవడం కూడ అవసరం. వాకింగ్‌తో అన్ని విధాలుగా మేలు జరుగుతున్నప్పటికీ కొన్ని నియమాలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

**• వాకింగ్‌లో పాటించాల్సిన అంశాలు**

నడక సమయంలో పాదాలకు సరిపడే బూట్లు వేసుకోవాలి. బిగుతుగా, వదులుగా ఉన్న బూట్లు ఉపయోగించడం మంచిది కాదు. తేలికగా ఉండే బూట్లు ధరించడం మంచిది. నడక సమయంలో మడమ కదిలిక సక్రమంగా ఉండేలా చూసుకోవాలి. నడక సమయంలో మనస్సు ప్రశాంతంగా ఉండే విధంగా చూసుకోవడంతో పాటు మంచి మంచి ఆలోచనలు చేయాలి. నడిచే సమయంలో శరీరానికి అతికినట్లుగా ఉండే దుస్తులు ధరించాలి. వదులుగా ఉండే దుస్తులు కూడా ధరించవచ్చు. చలికాలంలో స్వెటర్లు, మఫ్లర్‌లు ధరించడం మంచిది. వేసవిలో కాటన్ దుస్తులు ధరించడం మంచిది. ధరించిన దుస్తులు ఎంత అనుకూలంగా ఉంటే వాకింగ్ చేయడం అంత సులువుగా ఉంటుంది. నడక ఎక్కువ మందితో కలిసి కబుర్లు చెబుతూ చేస్తే ఉల్లాసంగా ఉంటుంది. నడక నిటారుగా తల పైకి ఎత్తుకొని చేస్తే మంచిది. వేగంగా నడవడం, పెద్దపెద్ద జంగలు వేస్తూ నడవడం సరైన పద్ధతి కాదని, ఆహ్లాదం కలిగించే మంచి పాటలు వింటూ నడక చేస్తే మంచి ప్రయోజనం ఉం టుందని నిపుణులు సూచిస్తున్నారు.

రెబ్బెన: గోలేటి శ్రీ భీమన్న క్రీడామైదానంలో వాకింగ్ చేస్తున్న యువకులు

### వాకింగ్‌తో వ్యాధులు రావు

ప్రతి నిత్యం వాకింగ్, వ్యాయామం చేయడం వల్ల వ్యాధులు దరిచేరవు. వాకింగ్ చేయడం వల్ల శరీరానికి ఎంతో మేలు కలుగుతుంది. ముఖ్యంగా చలికాలంలో చేసే వాకింగ్ ఆహ్లాదాన్ని కల్గిస్తుంది. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వాకింగ్ చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటాం. నేను చాలా సంవత్సరాల నుంచి గోలేటి శ్రీ భీమన్న క్రీడా మైదానంలో వాకింగ్ చేస్తున్నా. సింగరేణిలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రత్యేకంగా సమయం కేటాయించి వాకింగ్ చేస్తా.

**- జాడి కిషోర్,సింగరేణి కార్మికుడు,గోలేటి**

### క్రమం తప్పకుండా వాకింగ్ చేస్తా

గోలేటి గ్రామస్తులకు అందుబాటులో అన్ని వసతులు కలిగి ఉన్న గోలేటి శ్రీ భీమన్న క్రీడామైదానంలో క్రమం తప్పకుండా వాకింగ్ చేస్తా. యూనియన్ పరంగా ఎంత బీజీగా ఉన్నా మైదానానికి వచ్చి కొద్దిసేపు వాకింగ్ చేస్తే మైండ్ అంత రిలాక్స్ అవుతుంది. ప్రతిరోజూ ఉదయం, సాయం త్రం సమయంలో మైదానం వచ్చి వాకింగ్ చేస్తా. వాకింగ్ చేయని రోజు ఏదో వెలితిగా ఉంటుంది.

**-బోగే ఉపేందర్, గోలేటి**

### వాకింగ్ వల్ల మంచి ఆలోచనలు వస్తాయి

వాకింగ్ చేయడం వల్ల మంచి ఆలోచనలు వస్తాయి. చాలా సంవత్సరాల నుంచి వాకింగ్ చేస్తూనే ఉన్నా. ఆరోగ్యపరంగా ఏదైనా ఇబ్బంది అనిపిస్తే వాకింగ్ చేయడం వల్ల పోతుంది. చక్కని పాటలు పెట్టుకొని వాకింగ్ చేస్తుంటే చాలా ఆహ్లాదంగా ఉంటుంది. చలికాలంలో వాకింగ్ చేయడం వల్ల రోజూ చాలా ఉత్సాహంగా ఉంటుంది. వాకింగ్‌తో పాటు మంచి ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం బాగుంటుంది.

**- సిరికొండ జనక్ ప్రసాద్, గోలేటి**

## దుర్గాదేవి ఆలయంలో పూజలు

రెబ్బెన: కనకదుర్గాదేవి ఆలయంలో పుట్టువెంట్రుకలు తీస్తున్న అర్చకుడు దేవర వినోద్

రెబ్బెన, జనవరి 7: మండలంలోని ఇందిరానగ్ గ్రామంలో కొలువైన శ్రీ కనకదుర్గా దేవి స్వయంభూ మహాంకాళి ఆలయంలో ఆదివారం అమ్మవారిని భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు ఓడి బియ్యం, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న అనంతరం ఆలయ అర్చకుడు దేవర వినోద్ తీర్థ ప్రసాదాలు అందించి అన్నదానం ఏర్పాటు చేయగా భక్తులు పాల్గొన్నారు.

## చేలల్లోనే తెల్ల బంగారం



కౌటాల మండలంలో ఓ రైతు చేనులోని పత్తి

కౌటాల, జనవరి 7: కూలీల కొరతతో పంట చేనుల్లోనే తెల్ల బంగారం మగ్గిపోతుంది. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులకు పంట చేతిదాక రావడానికి నానా కష్టాలు పడుతున్నారు. మండలంలో పత్తి పంట దాదాపు చివరి దశలో ఉంది. చాలా వరకు పత్తిపంట అంతా పంట చేనుల్లోనే ఉంది. కూలీల కొరతతో పత్తి చేనుల్లోనే జారుతుంది. కిలోకు పది రూపాయల చొప్పున కూలీలు పత్తి ఏరేందు కు వస్తున్నప్పటికీ చాలా వరకు పంట ఇంకా ఏరడం పూర్తి కాలేదు. మండల వ్యాప్తంగా ఎక్కడ చూసినా చేనుల్లోనే పత్తి దర్శనమిస్తున్నది.గతంలో మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, రాజస్థాన్, ఒడిస్సా రాష్ట్రాల నుంచి కూలీలు వచ్చే వారు. ఈసారి కూడా ఆయా రాష్ట్రాల నుంచి కూలీలు వచ్చినప్పటికీ పంటలకు సరిపడా కూలీలు లేకపోవడంతో పత్తి చేనుల్లోనే పత్తి పగిలి జారిపోతుంది. చేతికి వచ్చిన పంట ఇలా చేజారడంతో రైతులు ఆందోళనలో పడ్డారు.

## వీణకు సావిత్రీబాయిఫూలే అవార్డు

కెరమెరి: ఉపాధ్యాయిని వీణను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందిస్తున్న క్షత్రియ్ కోసరే

కెరమెరి, జనవరి 7: మండలంలోని సావర్‌ఖేడా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కడేర్ల రంగయ్య భార్య వీణ అదే పాఠశాలలో ఎలాంటి జీతభత్యాలు తీసుకోకుండా స్వచ్ఛందంగా విద్యార్థులకు విద్యను భోదిస్తున్నందున్న ఆమె సేవలను గుర్తించి తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయిపూలే అవార్డును అందించారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఆదివారం క్షత్రియ్ కోసరే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీణను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అఖిల భారతీయ సావిత్రిబాయి బ్రిగేడ్ నాయకురాలు స్మితాతాయి చేతుల మీదుగా అవార్డు అందుకున్న అనంతరం వీణ మాట్లాడారు. విద్యను బోధించి ప్రతి ఒక్కరిని ప్రయోజకులు చేయాలనే సంకల్పంతో ఉచితంగా విద్యను బోధిస్తున్నాని చెప్పారు. విద్య విషయంలో ఎన్ని కష్టాలు ఎదురైనా ముందుకు సాగాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కడేర్ల రంగయ్య, మాలీ సంఘం నాయకులు అశోక్‌రావుని కోడే, సుకుమార్ పేట్‌కులే పలువురు ఉన్నారు.

## పల్లకీ సేవలో అయోధ్య అక్షింతలు

కొండపల్లిలో పల్లకీలో అయోధ్య అక్షింతలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

పెంచికల్‌పేట్, జనవరి 7: మండలంలోని కొండపల్లి గ్రామంలో ఆదివారం సర్పంచ్ ఉపాసి సంజీవ్ ఆధ్వర్యంలో అయోధ్య అక్షింతలను పల్లకీ సేవ ద్వారా ఊరేగిస్తూ పంపిణీ చేశారు. ముందుగా అయోధ్య అక్షింతలకు హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ అక్షింతలు, ఫొటో కరపత్రం అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు అశోక్ చారి, సంతోష్ చారి గ్రామస్తులు సుధాకర్, శ్రీనివాస్, శ్రీకాంత్, నారాయణ మహిళలు పాల్గొన్నారు.

**• కౌటాల మండలంలో..**

కౌటాల, జనవరి 7 : అయోధ్య అక్షింతలను మండలంలోని తలోడి గ్రామంలో ఆదివారం శ్రీ రామ క్షేత్ర ట్రస్ట్ కౌటాల శాఖ వారి ఆధ్వర్యంలో గ్రామంలోని హనుమాన్ మందిర్‌లో ప్రత్యేక పూజలు చేసి గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి గడప గడపకూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యు లు సత్యనారాయణ, వెంకటేశ్వ ర్, ఎమేశ్, బాపు, ప్రదీప్, శంకర్, బాలయ్య, సంతోష్, సాయి, మునేశ్, మహిళలు పాల్గొన్నారు.

## బుగ్గ దేవుడి వద్ద శ్రమదానం

సిర్పూర్(యు) జనవరి 7 : మండలంలోని మాహాగాంవ్ గ్రామపంచాయతీలోని అల్లీగూడ సమీపంలో ఉన్న బుగ్గ దేవుడి వద్ద ఆదివారం ఆల్లీగూడ గ్రామస్తులు శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతి యేటా నిర్వహించే వివిధ దేవుడి పుణ్య స్నానం వద్ద వివిధ గ్రామాల నుంచి వచ్చే భక్తుల కోసం స్థలాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మహాగాంవ్ రాయిసెంటర్ సర్మేడి ఆత్రం ఆనంద్‌రావ్,అల్లీగూడ గ్రామ పటేల్ సెడ్మాకి సంజీవ్, గ్రామస్తులు మెస్రం సుభాశ్, మెస్రం శీరామ్, సెడ్మాకి జానేరావ్, గేడం శంకర్, కనక ఆనంద్‌రావ్ ఉన్నారు.

బుగ్గ దేవుని వద్ద పరిసరాలను శుభ్రం చేస్తున్న అల్లీగూడ గ్రామస్తులు